# ఇక్ష్వాకు వంశోద్ధారకుడు



సంవత్సరాలైనా కూడా శిశువు జన్మించ లేదు. ఇంక ఆమె ఓర్పు పట్టలేక గర్భంపై అశ్మము (రాయి)తో మోదుకొంది. అంతటితో ఆమెకు పుత్రోదయం అయింది. అశ్మముచేత కొట్టబడగా పుట్టినవాడు కనక ఆ బాలుడు అశ్మకుడు అయ్యాడు.

అశ్మకుని తరవాత మూలకుడు, దశరథుడు, ఇలబిలుడు, విశ్వసహుడు, నియజ్ఞుడు, ఖట్వాంగుడు, దీర్ఘబాహుడు, సుదర్శనుడు, దిలీపుడు అనే రాజులు వరసగా ఇక్ష్వాకు వంశంలో జన్మించి రాజ్యాన్ని ఏలారు.

దిలీపునకు చరిత్ర ప్రసిద్ధుడైన రఘు మహారాజు జన్మించి రఘు వంశ మూల పురుషు డయ్యాడు.

రఘు మహారాజు కుమారుడు అజ మహారాజు. ఈతని పుత్రుడే దశరథ మహారాజు — అవతార మూర్తి అయిన శ్రీరాముని తండ్రి.

తన అపద్ధర్మంచేత ఇక్ష్వాకు వంశాన్ని ప్రవర్ధమానంచేసి, అనేకులు మహాపురుషులు ఆ వంశమునందు ఉద్భవించుటకు కారణభూతుడై, శ్రీమద్రామాయణ చరిత్రకు పరోక్షంగా మూల పురుషుడై పృథివిని తరింపజేసి, తానూ తరించాడు వశిష్ఠుడు. *